చేసే కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోనూ ఉన్న రోజుల్లో రామారావు గార్ని ఎద్దేవా చేసినవి, వేళాకోళం చేసినవి, జుగుప్సాకరంగా తీర్చిదిద్దినవి సుమారు పది పన్నెండు సినిమాలు సెన్సార్ సర్టిఫికేట్స్ సంపాదించమే కాక డబ్బు కూడా సంపాదించుకున్నవి వచ్చేయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వం లోని వి.ఐ.పి. లని తప్ప వేరే ఏ ప్రజానాయకుణ్ణి అయినా వేళాకోళం చేస్తే సెన్సార్ సర్టిఫికెట్ రావడం పెద్ద కష్టం కాదు. అయితే కేంద్ర ప్రభుత్వాన్నో ఆ బాపతు వి.ఐ.పి. లని ఏమాత్రం గిల్లినా ఇంతే సంగతులు. దీనికి "కిస్సాకుర్సీకా" అనంతరం సరికొత్త ఉదాహరణ "తరక్ ధన్ ధన్" అనే టి.వి. సీరియల్. రమేష్ శర్మ అనే ఆయన దీని రచయిత , నిర్మాత కూడా. ఈ సీరియల్ దూరదర్శన్ కోసం తయారు చేసిందికాదు, వీడియో లైబ్రరీల నెట్‌వర్క్‌లో ప్రయివేటు(గా) వేసి చూసుకోడానికే. ఇందులో వి.పి. సింగ్ గారి ప్రభుత్వం రావడం పోవడం, చంద్రశేఖర్ గారి ప్రభుత్వం తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఊగులాడ్డం కృత్రిమమైన పేర్లతో ఉదహరించారు రచయిత. కేంద్ర సెన్సార్ బోర్డు వారు ఈ పేర్లు కృత్రిమంగా ఉన్నా అందరికీ బోధపడి పోతున్నాయని బాధపడి సర్టిఫికేటు ఇవ్వడానికి నిరాకరించేరు. ప్రస్తుతం ఫిలిం అపలేట్ ట్రిబ్యునల్‌లో ఈ వీడియో సీరియల్ విడుదల సాధ్యాసాధ్యాలుగా పరిశీలనలో ఉన్నాయి.

"తరక్ ధన్ ధన్" అంటే అసలర్థం ఏమిటో గాని, నాకు మాత్రం ఇదో అర్థంలేని "ధ్వని" లా వుంది. ఏం చేస్తాం!

★

# 41. "విధానమే ప్రధానము"

ఎక్కడ చదివేనో చప్పున గుర్తు రావడం లేదు గాని, జోకులా కనిపించే ఒక స్వభావోక్తి కథ చదివేను, ఒకసారి.

ఒకానొక విందు కార్యక్రమానికి, ఒకే భవనంలో ఉంటున్న ఒక ఫ్రెంచి ఆసామీ, ఒక బ్రిటీష్ ఆసామీ-రావలసిన సమయానికి బాగా ఆలస్యంగా వచ్చారుట. ఆలస్యానికి కారణాలు చెప్తూ ఆ ఫ్రెంచి ఆసామీ, ఆ బ్రిటీష్ ఆసామీ; ఒకే కథను రెండు బాణీల్లో చెప్పేరుట.

"అమ్మయ్యో! ఆలస్యంగా వొచ్చాననంటే రానూ మరి! అసలు ఆలస్యంగా అయినా రాగలిగాననంటే అది మెచ్చుకోవలసిన సంగతి! ఏం జరిగిందనుకున్నారు! మా బిల్డింగ్ ఉందా? ఏం-ఆ బిల్డింగ్ యజమాని; వాణ్ణి తవ్విపాతరెయ్యా. నాలుగంతస్తులు కట్టేడు, ఒక్కొక్క అంతస్తుకీ ఆరేసి ఎపార్టుమెంట్లు . ఒక్కొక్క ఎపార్టుమెంటుకి వెయ్యేసి (రూపాయలు) అద్దె. అంటే ఎంతయింది? ఇరవై నాలుగు వేలు! ఇంకా ఆశ చావలేదు, మానవుడికి! అయిదో అంతస్తు కట్టి అక్కడ కూడా ఆరు ఎపార్టుమెంట్లు ఏర్పాటు చేసి మరో ఆరుగురికి అవి అద్దెకిచ్చేసి ఇప్పుడొస్తున్న ఇరవై నాలుగువేలే కాక ఇంకో ఆరువేలు నొల్లు కుందామని 'ప్లాను' వేసేడు! సరే ప్లాను ఎప్రూవు చేయించుకుని నిర్మాణం సాగిస్తున్నాడు. ఇవాళ ఇక్కడ డిన్నరు రాత్రి ఎనిమిదింటికి కదా. సరే, ఏడున్నరకి డిన్నర్ డ్రస్ వేసుకుని ఇక బయల్దేరుదామని సిద్ధం అయ్యానో లేదో; పైని పెద్ద ప్రళయం లాంటి చప్పుడు! అడావిడిగా నా ఎపార్టుమెంట్ లోంచి

ఇవతలి కొచ్చి మెట్లన్నీ ఎక్కి వెళ్లి చూస్తే ఇంకేముంది? చెబితే మీరసలు నమ్మరు! ఐదో అంతస్తులో తూర్పువైపున కడుతున్న ఎపార్టుమెంటు-ఏది-ఇంకా లింటల్ లెవెల్‌కు రాలేదు గోడలు; అవి కూలిపోయాయి! ఆ కూలిపోవడం లోనూ ఎలాగంటారు! ఒక్క ఇటిక గాని, ప్లాస్టర్‌గాని అంచనాకి దొరక్కుండా విరిగి, పగిలి, దుంపనాశనం అయ్యాయంటే నమ్మండి! ఆ గోడలు కూలిపోయిన అదురుకి నాలుగో అంతస్తులో సరిగ్గా దానికిందనున్న ఎపార్టుమెంటు ఏది- డాక్టర్ బెంజిమన్ ఉంటాడే, ఆ ఎపార్టుమెంటన్నమాట - ఆ ఎపార్టుమెంటంతా కదిలి పోయింది, సమూలంగాను! ఫ్యాన్లు ఊగిపోయాయి. కిటికీ రెక్కలు టపా టపా కొట్టుకున్నాయి. బీరువాల మీద కబోర్డుల్లోనూ పై స్లాబు ప్లాస్టర్లు ముక్కలు ముక్కలుగా పడిపోయి నానా బీభత్సం అయిపోయింది, వెంటనే ఫైర్ సర్వీస్ వాళ్లకి ఫోన్ చేసాను. వాళ్లొచ్చి ఆ చీకట్లో సెర్చిలైట్లు పెట్టి నిచ్చెన్లు వేసిఎంత గందర గోళం చేసేరని! చివరికి ఆ 'డెబ్రి' అంతా ఓచోట పోగేయించి అందరికీ ధైర్యం చెప్పి అప్పుడు బయల్దేరి వొచ్చేనన్నమాట. లేటయిందంటే అవదూ మరి? అవతల మనుషుల ప్రాణాలకే ముప్పొచ్చే అంత దారుణం జరిగిపోతే మనకేమీ పట్టనట్టు డిన్నర్ కొచ్చి చిన్ని నా బొజ్జకి శ్రీరామ రక్షా అంటూ కూచోడానికి మనం ఇంతో అంతో మనుషులం కదా'' ఇంత వివరంగా చెప్పి; అందులో ప్రతి వివరానికీ అనుగుణమైన భావోద్వేగం ఆంగికం సమకూర్చి తన ఆలస్యాన్ని సమర్థించుకున్నవాడు ఫ్రెంచి ఆసామీట.

"అవును, లేటయ్యాను. అయాం సారీ. నా కోసం కొంచెం సేపు చూసి వుంటారు, పాపం!'' అని ఊరుకున్నాడట బ్రిటీష్ అసామీ. "అది కాదు. మీరు సాధారణంగా ఏ కార్యక్రమానికైనా పంక్చువల్‌గా వస్తారే. మరి ఇవాళ ఎందుకింత లేటయ్యారు?'' అని అడిగితే కూడా; "మా బిల్డింగ్‌లో పై అంతస్తులో చిన్న డిస్టర్బెన్స్ వల్ల'' అని చెప్పేడట.

ఒకే సంఘటనకి రకరకాలుగా స్పందించేవారు ఎందరెందరో ఉన్నా ఈ స్పందనలు ముఖ్యంగా రెండు రకాలే ఉంటాయని చెప్పొచ్చు. మొదటి రకం (రావికొండలరావు చెప్పినట్టు) "స్వామి ఆశ్చర్యానంద''లు; రెండో రకం "స్వామి సహజానంద''లు - అవుతారు.

"సుబ్బారావు గారింట్లో కొబ్బరిచెట్టు కూలిపోయి డబ్బారేకుల షెడ్డు దిబ్బయిపోయింది'' అన్న వార్తకి - "ఏమిటి - సుబ్బారావు గారింట్లోనే! అబ్బా!! కొబ్బరి చెట్టే కూలిపోయిందా! ఎంత ఆశ్చర్యం!!'' అంటూ ఒకరు తను మాటాడుతూ ఇతరుల్ని నిశ్శబ్దపరిస్తే "ఏముంది? కొబ్బరి చెట్టు కదా. వేళ్లు నిలువుగా కాకుండా పక్కకు వ్యాపిస్తాయి. పొడుగాటి చెట్టు అయి వుంటుంది. కాసుకోవడానికి వేళ్లకి బలం చాలదు కదా. కూలిపోయుంటుంది. చెట్టు కూలిపోయి షెడ్డు మీద పడింది కాబోలు, షెడ్డు అణిగిపోయింటుంది'' ఇలా సముదాయించుకుంటూ తనే అవాక్కయిపోతాడు రెండో రకం మనిషి

ఓసారి నేను మద్రాసు వెళ్లినపుడు భమిడిపాటి రాధాకృష్ణ గారికి ఫోన్ చేసి "బిజీగా ఉన్నావా? నిన్నోసారి పలకరించాలని వుంది.'' అన్నాను. "ఏదో సినిమాకి డైలాగులు రాస్తున్నాను. కాని, ఫరవాలేదు, రా'' అన్నారు. వెళ్లాను. నన్ను కూర్చోబెట్టి నాకోసం మంచినీళ్లూ, కాఫీ చెప్పడానికి అతను లోపలికి వెళ్లిన సమయంలో అతను అక్కడ పెట్టిన కాగితాల్లోకి దొంగతనంగా

చూసేసాను. "సుందరీ, నిన్ను నేను గాఢంగా ప్రేమిస్తున్నాను. అవును. నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను.- "హేమా! సుందరితో జరగబోయే నా వివాహాన్ని భగ్నం చెయ్యాలని నువ్వు చేసిన కుట్రకి నిన్ను భగవంతుడు కూడా క్షమించడు. భగవంతుడు కూడా క్షమించడు". - "అన్నయ్యా; మన ముద్దుల చెల్లెలు సావిత్రి పెళ్లికి డబ్బు చాలదంటే మన ఇల్లు అమ్మేద్దాం. మన ఇల్లు అమ్మేద్దాం". ఇలా ఉన్నాయి అవి. అవి సరిగ్గా మింగుడు పడక రాధాకృష్ణ గారు తెచ్చిన మంచినీళ్లు గటగటా తాగేసి అప్పుడు అడిగేను. "ఏమిటి, ఒక్కొక్క డైలాగులో చివరి భాగం రెండేసి సార్లు రాసేవు? ఒకసారి అంటే చాలు కదా" అని. "కాదు కాదు ఆ హీరో వేషం వేసే ఆయన ఉద్వేగం బాగా ఒప్పించగల నటుడు. ఒకేలా వున్న ఆ రెండేసి డైలాగుల్నీ రెండు రకాలుగా చెప్పడం అతని ప్రత్యేకత" అని నాకు రాధాకృష్ణ గారు బోధపరిచాడు.

కిందటి బుధవారం పేపర్లో నాకు హాస్య రచనకుగాను తెలుగు విశ్వవిద్యాలయం వారు ఒక అవార్డు ఇయ్యబోతున్నట్టు ప్రకటించారు కదా. గురువారం నాడు నేనిదివరకు పని చేసిన ఆఫీసుకు వెళితే అక్కడ ఒక (అలనాటి) సహోధ్యాయి నన్ను పలకరించి "ఏటి గురూ, నీ కేదో ఎవార్డొచ్చినట్టు పేపర్లో పడ్డాదిట?" అన్నాడు. "ఆ, హాస్యానికి." అన్నాను.

"ఓస్ ఇంతేనా. నేనింకా నిజమే కాబోలనుకున్నాను. వస్తాను" అని వెళ్లిపోయేడతను.

రేడియోలో గాని, టి.వి.లో గాని వార్తలు చదివే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ విధమైన భావోద్వేగం వ్యక్తపరచకూడదని ఏదో రూలు ఉందనుకుంటాను. కాని, **1948** జనవరి **30**వ తేదీ సాయంకాలం తెలుగులో వార్తలు చదివిన వ్యక్తి ఆ ఒక్క వార్త (గాంధీ మహాత్ముని హత్య వార్త) చదువుతూ పదిహేను నిమిషాల పాటు దుఃఖం వ్యక్తపరచడం నాకు ఇంకా జ్ఞాపకం వుంది. ఒకసారి ఒక విదేశీ టి.వి. సంస్థ చేసిన వార్త ప్రసారం వీడియో క్యాసెట్ ఒకటి పెట్టుకుని చూసేం. అందులో (ఆ మధ్య వరకు మన టి.వి. వాళ్లు ఉంచినట్టే) ఇద్దరు న్యూస్ రీడర్లు ఒకే ఫ్రేంలో ఉన్నారు. అయితే వాళ్లిద్దరూ శరీరాలు బిగపెట్టుకుని కూర్చోలేదు. ముందుగా ఒకర్నొకరు నవ్వుతూ పలకరించుకున్నారు. హలో బెనెట్. అంటే హలో జార్జ్ అని. ఆ తరువాత జార్జ్ అనేవాడు "ఇవాళ ఉదయం ఏంటైందో తెలుసా? బుష్ గారు గోర్బచెవ్ గారితో హాట్‌లైనులో మాట్లాడి ఈ నెల తొమ్మిదో తారీకుని హెల్సింకీలో శిఖరాగ్ర సమావేశం జరుపుకుందాం అని ఫిక్స్ చేసేరు." అంటాడు. ఆ ఐటం వివరాలన్నీ అయ్యేక బెనెట్ కొంచెం విచారంగా మొహం పెట్టి "పాపం; మెక్సికోలో భూకంపం ఒచ్చి సుమారు 20 వేల మంది పోయారు తెలుసా? ఇదిగో చూడు; వీడియో వచ్చింది" అని అది ప్రదర్శిస్తాడు. "ఇది చూడూ బెనెట్; ఒక ఐదేళ్ల పాప స్వంతంగా కారునడపడం వింత!" ఈ పద్ధతిలో సాగింది ఆ కేసెట్.

మనం నవ్వవలసిన సంఘటన ఏదైనా జరిగితే వాళ్లిద్దరూ ఆ సంఘటన వివరిస్తూ మనతోబాటు నవ్వేరు కూడాను.

మొన్న ఆదివారం నాడు మన తెలుగు టి.వి వార్తల్లో హెడ్‌లైన్సులో మొట్టమొదటి వార్త కొన్ని లక్షల మంది ప్రేక్షకుల్ని కొన్ని క్షణాల పాటే అయినా గొప్ప బాధలో ముంచింది. అది ఇలాగః-

"ప్రఖ్యాత సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు-"

రెండున్నర సెకండ్లు ఆగాడు; వార్తలు చదివిన వ్యక్తి. అతని మొహంలో (రూల్ ప్రకారం) దుఃఖం లేదు గాని సంతోషం అసలు లేదు. కేవలం శాంతి స్వరూపం; అంతే.

"1990కి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును గెల్చుకున్నారు."

పాపం శమించుగాక! ఇలా, రెండు సెకన్లు కాదు ఒక్క సెకండ్ అయినా సరే ప్రేక్షకుల్ని ఏడిపించే హక్కు న్యూస్ రీడర్లకి లేదు.

అవును న్యూస్ రీడర్లుకి ఆహక్కు లేదు.

లేదు గాక లేదు! ★

# 42. పెన్షన్ గొడవలు

'**జా**తస్య మరణం ధ్రువమ్' అన్నారు ఎవరో. ఎవరో ఏమిటి రుషులే అనుంటారు.

ఉద్యోగిస్య పెన్షన్ ధ్రువమ్ అని కూడా అనవలసింది.

రూల్సులో వున్నా రుషులు చేస్తే దాని సొగసు వేరు. అంచేత - ఎలాగా లక్నో వెళుతున్నాను కదా అని అక్కడికి దగ్గర్లో వున్న నైమిశారణ్యానికి వెళ్లేను.

అక్కడ అన్ని కులాలకి చెందిన రుషులూ బోల్డుమంది "బోల్డు" గా తపస్సు చేసుకుంటున్నారు.

ఒహాయన్ని డిస్టర్బ్ చేసి "అనండీ" అన్నాను.

"ఏమిటనమంటావు" అన్నారాయన.

"ఉద్యోగిస్య పెన్షన్ ధ్రువం - అనండి"- అన్నాను.

"అన్లేను." అన్నారాయన.

"అదేం?"

"ధ్రువం అనేటప్పుడు ఉత్తర ధ్రువమా దక్షిణ ధ్రువమా అని నిర్ణయించాలి కదా." అని ఆయన మళ్లీ సమాధిలోకి వెళిపోయారు.

"అమ్మ నాయనో మీక్కూడా తెలిసిందీ, ఉత్తర దక్షిణాల సంగతి?" అనుకుంటూ మళ్లీ వొచ్చేసేను.

ఏజీ ఆఫీసులో నా ఏజి గ్రూపువాళ్లూ నా వేజి గ్రూపు వాళ్లూ చాలామందే వున్నారు.

ఉత్తరం అక్కర్లేదు. దక్షిణం అక్కర్లేదు.

అయితే పని మాత్రం జరగదు. రికమెండేషన్ తెస్తే - "అయ్యో గురూగారూ; మీకు హెల్ప్ చెయ్యమని ఇంకో కోన్‌కిస్కాయి ఉత్తరం రాసి ఇవ్వడమా" అని నెత్తి కొట్టుకుంటారు.

"ఇంకో కోన్‌కిస్కాయి" అన్న ఎక్స్‌ప్రెషన్‌లో నా ప్రసక్తి ఉండొచ్చు. ఉండకపోవచ్చు.

పోనీ ఏదైనా సంభావన ఇద్దామని జేబులో చెయ్యి పెట్టినట్టు నటిస్తే "మమ్మల్ని అంత